"తాళం వేయలేదే? న్యూయార్క్‌లో నేను తాళం వేయకపోతే కారు మాయం అవుతుంది."

"ఇక్కడంతా మంచివాళ్ళే కాబట్టి కారుకి తాళం వేస్తేనే నష్టం." చెప్పాడు క్లయింట్.

చర్చిలో పనయ్యాక ఇద్దరూ వచ్చి కారు ఎక్కారు. కారు వెనక సీట్‌లో రెండు పుచ్చకాయలు, ఏపిల్ పళ్ళ బుట్ట వుండటం లాయర్ గమనించాడు.

## 159. అహం వీడకపోతే

తన జీవిత కాలంలో చాలా ఆధ్యాత్మిక సాధన చేసిన ఓ యోగికి తనలాంటి నలభై రకాల శరీరాలని సృష్టించుకునే సిద్ధి లభించింది. తన మరణ కాలం సమీపించగానే అతను తెలివిగా నలభై రకాల శరీరాలని సృష్టించుకున్నాడు. యమ భటులు వచ్చి, ఆ శరీరాలన్నిటినీ చూడగానే తాము ఎవరి ప్రాణాలు తీసుకెళ్ళాలో తెలీక వెనక్కి తిరిగివెళ్ళి యముడికి జరిగింది వివరించారు.

యముడు వాళ్ళకి ఏం చేయాలో బోధించి మళ్ళీ పంపాడు. వాళ్ళు తిరిగి ఆ నలభై శరీరాలు ఉన్న గదిలోకి వెళ్ళి వాళ్ళల్లో వాళ్ళు ఇలా మాట్లాడుకోసాగారు.

"ఆహా! ఈ శరీరం ఎంత అద్భుతంగా వుంది! ఇది చూడండి అద్వితీయం! అబ్బో ఒకే రకం శరీరాలు నలభై చేయడం ఒక్క బ్రహ్మకే చేతైంది..."

వారి మాటలు వింటూ ఉబ్బిపోయిన ఆ యోగి వెంటనే చెప్పాడు.

"బ్రహ్మ కాదు. వీటిని నా యోగ శక్తితో నేనే నిర్మించాను."

వెంటనే యమ భటులు ఆ యోగిని పట్టుకుని అతని ప్రాణాలు తీసి యమలోకానికి లాక్కెళ్ళారు.

ఆ యోగిలోని అహంలా మనలోని అహం కూడా మనల్ని మళ్ళీ మళ్ళీ పుట్టి, మళ్ళీ మళ్ళీ చచ్చేలా చేస్తూంటుంది. మనలోని అహాన్ని ప్రయత్నపూర్వకంగా తొలగించుకుంటే కాని, మనం జీవన్మరణ చక్రంనించి విడివడలేము.

## 160. వ్యామోహం

ఓ రోజు అరిషడ్ వర్గాల (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల) అధి దేవతలు తమ స్నేహితుడితో కలిసి అడవికి వెళ్ళి, అక్కడ చాలాకాలంగా తపస్సు చేసుకుంటున్న ఓ సాధువు దగ్గరకి వెళ్ళి మౌనంగా నించున్నారు. వాళ్ళు కొద్దిసేపు అలా వేచి ఉన్నాక ఆ సాధువు లేచి దీర్ఘంగా నిట్టూర్చి పట్టణం వైపు వెళ్ళిపోయాడు. ఆ దేవతలంతా వెంటనే ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు.

ఇదంతా చూసి అర్థం కాని వారి స్నేహితుడు అడిగాడు.

"నాకిది చెప్పండి. చాలాకాలంగా తపస్సులో ఉన్న ఆ సాధువు ఎందుకు ఇంత అకస్మాత్తుగా లేచి పట్టణం వైపు వెళ్ళిపోయాడు? మీరు ఎందుకు ఒకరినొకరు అభినందించుకున్నారు?"

"ఆ సాధువుకి ఇంతకాలానికి సత్యం యొక్క ఓ చిన్న భాగం ఇందాక దొరికింది. దాంతో వెళ్ళిపోయాడు."

"అదేమిటి? సత్యం యొక్క పూర్తి భాగం దొరక్కుండానే ఎందుకు తపస్సులోంచి లేచాడు?"

"ఎందుకంటే అతను మొత్తం దొరికేదాకా వేచి ఉండకుండా శిష్యుల కోసం, భక్తుల కోసం, ఆశ్రమం కోసం, ప్రవచనాలివ్వడం కోసం వ్యామోహంతో పరుగు తీసాడు. అతనికి ఈ విషయంలో మా సహాయం తప్పక లభించింది." నవ్వుతూ జవాబు చెప్పారు అరిషడ్ వర్గాల దేవతలు.